

# చదువు

## వైవిధ్య



**ప్రకటన ఫిబ్రవరిలోనే!**

దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను విశేషంగా ఆకర్షించే పరీక్ష.. సివిల్‌సర్వీసెస్! మిగతా పోటీ పరీక్షలకంటే ఇది విభిన్నం. ఈ పరీక్ష ముఖ్య వివరాలు...

- సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్: 7.2.2018
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 6.3.2018
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 3.6.2018
- మెయిన్స్ పరీక్ష తేదీ: 1.10.2018 నుంచి
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం



# కొత్త టెక్‌లు కావాలి!

**ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోకపోతే పరిశ్రమలు మీవైపు కన్నెత్తి కూడా చూడవు. ఇంజినీరింగ్ డిగ్రీ ఉంది ఇకచాలు అనుకుంటే కుదరదు. తాజా టెక్నాలజీలు తెలుసుకోవాల్సిందే.**

**బీటెక్‌లతోపాటు కంప్యూటర్ లింక్ ఉన్న ఏ డిగ్రీ వారైనా నేర్చుకోదగిన సరికొత్త టెక్నాలజీలు కొన్ని...**

### డాటా సైన్స్



డాటా సైన్స్ పరిశ్రమ కొన్నేళ్లుగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. బిగ్ డాటాకు ప్రాముఖ్యం పెరుగుతోంది. ఎన్నో కంపెనీలు దీనిలో పరిజ్ఞానమున్న, సమాచార విశ్లేషణలో నిష్ణాతులైన ఉద్యోగుల కోసం వెతుకుతున్నాయి. ఆర్- లాంగ్వేజ్‌ను స్టాటిస్టికల్ విశ్లేషణ, విజువలైజేషన్‌ల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు. అనలిటిక్స్‌లో కీలకమైన ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ఎస్‌ఏఎస్‌ను నేర్చుకోవటం ఉత్తమం. కశాంద్రా డాటాబేసెస్ గురించి అవగాహన పెంచుకోవటం లాభదాయకం.

### డాటా విజువలైజేషన్



'మాటల్లో కాదు, చేతల్లో చూపించండి' అనే సామెత సాంకేతిక ప్రపంచానికీ వర్తిస్తుంది. డాటా విజువలైజేషన్.. అనలిటిక్స్, ఇతర డాటా నైపుణ్యాలతో కలిసి ముందుకుసాగుతుంది. ఒక్కసారి సమాచారాన్ని సేకరించి, అమరిస్తే దాన్ని ప్రతి ఒక్కరికీ అవసరమయ్యే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంటుంది. దీనిలో డాటా విజువలైజేషన్‌ది ప్రముఖపాత్ర. డాటా మోడల్స్‌ను తయారుచేయటానికి డయాగ్రమ్‌లు, టెక్స్ట్, సింబల్స్ ఉపయోగిస్తారు. ఆ రకంగా కష్టతరమైన అంశాలు సులభతరమైన విజువల్ కమ్యూనికేషన్‌గా మారతాయి.

### యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్



యాప్స్, ప్రోగ్రామ్‌లు, వెబ్‌సైట్ల రూపకల్పనలో యూజర్ ఇంటర్‌ఫేస్ డిజైన్ కీలకం. వీటిని వినియోగదారులు సులువుగా తెలుసుకునేందుకు, వారిని ఆకట్టుకునేందుకు, మంచి అనుభూతిని మిగిల్చేలా చేసేందుకు ఈ యూఐ ప్రధానం. వినియోగదారుల అభిరుచులను అంచనా వేసి, వాటికి అనుగుణంగా ప్రోటోటైప్‌లను తయారుచేయటంలో, వాటిని మెరుగుపరచటంలో యూఐ నిపుణులు ప్రధానం. దీని కోసం ఫ్రంట్ ఎండ్ వెబ్ డెవలప్‌మెంట్, గ్రాఫిక్ డిజైన్, కమ్యూనికేషన్ లాంటి నైపుణ్యాలు అవసరం.

### మొబైల్ డెవలప్‌మెంట్



స్మార్ట్‌ఫోన్ల, ట్యాబ్లాయిడ్‌ల వాడకం పెరుగుతోంది. ఐవోఎస్, ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్లలో మొబైల్ యాప్స్‌కు గిరాకీ బాగా ఉంది. వీటిని తయారుచేసే నిపుణుల్ని కంపెనీలు ఆకర్షిస్తున్నాయి. వినియోగదారులు సులువుగా వినియోగించుకునేందుకు నూతన అప్లికేషన్లనూ, మొబైల్ ఫ్రెండ్లీ వెబ్‌సైట్లనూ రూపొందించటం అవసరం. క్రాస్ ప్లాట్‌ఫాం డెవలప్‌మెంట్ సామర్థ్యం ఉంటే వివిధ రకాల డివైజ్‌లకోసం యాప్స్‌ను ప్రవేశపెట్టవచ్చు. ఇంకా యూఎక్స్, యూఐ, ఏజైల్ మెథడాలజీలు వంటి కీలక నైపుణ్యాలను తెలుసుకోవాలి.

### క్లౌడ్, డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్



గతంలో ఉన్న ఆన్‌డివైజ్ సాఫ్ట్‌వేర్, స్టోరేజ్ వంటివి ఇంకా వినియోగంలో ఉండగానే క్లౌడింగ్‌లో నూతన పద్ధతులు చాలా వచ్చాయి. సమస్యల్ని పరిష్కరించటానికి అనేక కంప్యూటర్లను ఒకదానితో ఒకటి కలిపే డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్‌కు దాదాపు అన్ని కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్‌లకు సంబంధించిన నైపుణ్యాలు, రెండింటిలోనూ తగినంత నైపుణ్యాలున్న ఉద్యోగులను చాలా కంపెనీలు కోరుకుంటున్నాయి. డాటాబేస్ మేనేజ్‌మెంటులో ఉపయోగించే ఎస్‌క్యూఎల్‌ను, క్లౌడ్ ఆధారిత అప్లికేషన్ల అభివృద్ధిలో కీలకమైన రుబీ, జావాస్క్రిప్ట్, పైథాన్ లాంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లను నేర్చుకోవటం ఉత్తమం.

### సైబర్ సెక్యూరిటీ



ఒక కంపెనీకి చెందిన సమాచారానికి పటిష్ఠమైన భద్రత తప్పనిసరి. సమాచారం చోరీకి గురైతే అంతిమంగా ఆ సంస్థ తన వినియోగదారుల నమ్మకాన్ని కోల్పోతుంది. ఈ కారణంగా సైబర్ భద్రత ఎవర్‌గ్రీన్ నైపుణ్యాల్లో ఒకటిగా మారింది. అందుకే సైబర్ నిపుణులకు ఎల్లప్పుడూ మంచి గిరాకీ ఉంటోంది. ఈ రంగంలో ఎదగటానికి జనరల్ ప్రోగ్రామింగ్, ఫైర్‌వాల్స్ పరిజ్ఞానం, స్క్రిప్టింగ్ లాంగ్వేజీల్లో ప్రావీణ్యం, నెట్‌వర్కులూ, ఆపరేటింగ్ సిస్టమ్స్‌పై లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి.




**దాదాపు ఆరునెలల సమయం. ఆలోచిస్తే చాలా టైమ్ ఉన్నట్లనిపిస్తుంది. కానీ సివిల్స్ ప్రిలిమ్స్‌లాంటి పరీక్ష ప్రిపరేషన్‌కు అది తక్కువే. అయితే అలా అనుకుంటూ నిరాశపడాల్సిన పనిలేదు. అనువైన అధ్యయన వ్యూహాన్ని అనుసరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. కలెక్టర్ కావాలనే మీ కలను సాకారం చేసుకోవచ్చు.**

# కౌంట్‌డౌన్ మొదలు

ప్రతిష్ఠాత్మకమైన సివిల్ సర్వీసెస్ ప్రాథమిక పరీక్ష (ప్రిలిమినరీ) కొత్త సంవత్సరంలో జూన్ 3న జరగబోతోంది. ఇంకా ఆరు నెలల సమయం కూడా లేదు. ఇప్పటికే ఎంతోకొంత అధ్యయనం సాగించిన అభ్యర్థులు ఇప్పుడు తమ సన్నద్ధత తీరును లక్ష్య దిశగా వేగవంతం చేసుకోవాలి.

సివిల్స్ ప్రశ్నపత్రాన్ని తయారు చేసేవారికి యూపీఎస్సీ ముందస్తుగానే పరీక్షకు సంబంధించి రెండు లక్ష్యాలను సూచించింది. ఎ) ఎల్లప్పుడూ పరిజ్ఞానాన్నీ, నైపుణ్యాలనూ పెంపొందించుకునే అభ్యర్థులను ఎంపిక చేయాలి. బి) నియమితులు కాబోయే సర్వీసుకు ప్రేరణపరంగా తగినవారై భావోద్వేగ బంధం ఏర్పరచుకోగల అభ్యర్థులను కనుగొనాలి.

అందుకే సివిల్స్‌లో ప్రాథమికాంశాలపై అభ్యర్థికి పట్టునూ, వాటిని వర్తమాన విషయాలకు జోడించగల సామర్థ్యాన్నీ చూస్తారు. అంటే నిరంతర జ్ఞాన సముపార్జన చేయగల సత్తా అన్నమాట. ప్రగతిపై అనురక్తినీ, జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలూ, ప్రజల సమస్యలూ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల అభ్యర్థి ఆసక్తినీ పరీక్షిస్తారు. వీటితో పాటు ప్రభుత్వ దార్శనికతపై అవగాహన, దాన్ని అందుకోవడంలో తీసుకుంటున్న చర్యల పట్ల అభ్యర్థికి ఎంత అవగాహన ఉందో పరీక్షిస్తారు.



వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లుంటాయి. అవి: జనరల్‌స్టడీస్ పేపర్-1, జనరల్‌స్టడీస్ పేపర్-2. ప్రతీ పేపర్‌కు 200 మార్కులు. పేపర్-1లో 100 ప్రశ్నలుంటాయి. ప్రతి సరైన సమాధానానికి రెండు మార్కులు. పేపర్-2లో 80 ప్రశ్నలూ, ప్రతి సరైన సమాధానానికి 2 1/2 మార్కులు ఉంటాయి. రుణాత్మక మార్కులుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.33% కోత ఉంటుంది.

**ప్రిలిమినరీలో క్వాలిఫై అవ్వాలంటే ఎన్ని మార్కులు సాధించాలి? గత రెండు సంవత్సరాల కటాఫ్ మార్కులను పరిశీలిస్తే...**

| పరీక్ష | జనరల్ | | ఓబీసీ | | ఎస్‌సీ | | ఎస్‌టీ | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 2015 | 2016 | 2015 | 2016 | 2015 | 2016 | 2015 | 2016 |
| సివిల్స్ ప్రిలిమినరీ | 107.34 | 116.00 | 106.00 | 110.66 | 94.00 | 99.34 | 91.34 | 96.00 |

2017లో కటాఫ్ మార్కుల స్థాయి 108 నుంచి 112 మధ్యలో ఉంది. ఏదేమైనా దీనిని యూపీఎస్సీ 2018 జూన్‌లో అధికారికంగా ప్రకటిస్తుంది. ప్రశ్నల కఠినస్థాయి ఆధారంగా కటాఫ్ స్థాయి ఇలాగే ఉంటుందని భావించవచ్చు. ఆ మార్కులు తెచ్చుకోవటానికి సరైన వ్యూహం కావాలి.

## సిలబస్‌పై అవగాహన

సిలబస్‌ను పరిశీలించి, తాజా ధోరణులను అవగాహన చేసుకుంటే తగిన వ్యూహం రూపొందించుకోవటం సాధ్యమవుతుంది. పేపర్-1 సిలబస్‌ను గమనిస్తే...

1. **కరంట్ అఫైర్స్:** జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలు
2. **హిస్టరీ ఆఫ్ ఇండియా అండ్ ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్:** భారతదేశ చరిత్ర, జాతీయోద్యమం.
3. **జాగ్రఫీ:** భౌతిక, సాంఘిక, ఆర్థికపరంగా భారతదేశ భౌగోళిక వ్యవస్థ, ప్రపంచ భౌగోళిక వ్యవస్థ.
4. **ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్:** రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, పంచాయతీ రాజ్, పబ్లిక్ పాలసీ, హక్కుల అంశాలు.
5. **ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్:** నిలకడైన ప్రగతి, పేదరికం, ఇన్‌క్లూజన్, డెమోగ్రాఫిక్స్, సోషల్ సెక్టార్ ఇనిషియేటివ్స్.
6. **ఎన్విరాన్‌మెంటల్ ఎకాలజీ:** జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు.
7. **జనరల్ సైన్స్:** విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన ఆచరణాత్మక అంశాలు.

**ప్రశ్నలు (సగటున)**

| అంశం | 2014 | 2015 | 2016 | 2017 |
|---|---|---|---|---|
| కరంట్ అఫైర్స్ | 6 | 15 | 42 | 32 |
| జనరల్ నాలెడ్జ్ | 10 | 9 | 8 | 3 |
| హిస్టరీ ఆఫ్ ఇండియా అండ్ ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్ | 18 | 14 | 12 | 13 |
| ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్ | 11 | 14 | 8 | 24 |
| జనరల్ సైన్స్ | 16 | 7 | 3 | 3 |
| ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ | 10 | 17 | 8 | 5 |
| ఇండియన్ అండ్ వరల్డ్ జాగ్రఫీ | 18 | 14 | 6 | 8 |
| ఎన్విరాన్‌మెంటల్ ఎకాలజీ | 11 | 10 | 13 | 12 |
| మొత్తం | 100 | 100 | 100 | 100 |

గత రెండు సంవత్సరాల్లో కరంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యం లభించింది. వర్తమాన అంశాల్లో ఎక్కువ ప్రభుత్వ పథకాలకు సంబంధించి వచ్చాయి.

ఈ సిలబస్ మరీ 'జనరల్' స్వభావంతో ఉంది. ఒక నిర్దిష్ట అంశం పరిధిలో ఏముంటాయో గ్రహించటం కష్టం. మరెలా? గత కొద్ది సంవత్సరాల్లో ఒక్కో అంశం నుంచి ఎన్ని ప్రశ్నలు వచ్చాయో పరిశీలించి విశ్లేషించటం మాత్రమే సరైన మార్గం.

## పునాది ఏర్పరుచుకోవాలి

- సిలబస్‌లో ఉన్న ప్రతీ సబ్జెక్టులోని మౌలిక అంశాలపై అవగాహన అవసరం.
- ఈ సబ్జెక్టుల్లో చాలావరకూ విద్యార్థులకు కొత్త అంశాలే. పదో తరగతి తర్వాత ఎక్కువమంది సైన్స్‌నో, కామర్స్‌నో ఎంచుకోవటం వల్ల ఈ సబ్జెక్టుల పరిచయం తక్కువ. అందుకే వీటిలో ప్రాథమిక అంశాల్లో పునాది ఏర్పరచుకోవటం అవసరం.
- మౌలిక అంశాలు నేర్చుకున్నాక, ఆ సబ్జెక్టుల్లో గత సంవత్సరాల్లో ఏయే ప్రశ్నలు అడిగారో గమనించాలి.
- ప్రశ్నల శైలి ఏటా మారుతుంటుంది కాబట్టి ఏ ప్రశ్న అయినా సూచనాత్మకమే.
- ఆ తర్వాత ఆయా సబ్జెక్టుల్లోని తాజా/వర్తమాన అంశాలపై దృష్టి పెట్టాలి.

## టైమ్ టేబుల్స్

వివిధ సమయ వ్యవధులతో టైమ్ టేబుల్స్ వేసుకుని, అధ్యయనం సాగించాలి. మొదటి టైమ్ టేబుల్ వారం రోజులకు (వీక్లీ) వేసుకోవాలి. రెండోది 15 రోజులకు. మూడోది 30 రోజులకు. నాలుగోది ఐదు నెలలకు. వీక్లీ టైమ్ టేబుళ్లు మంత్లీ టైమ్ టేబుళ్లతో అనుసంధానమైవుండేలా రూపొందించుకుని చదవాలి.

## 75% వస్తోందా?




ఒక్కో సబ్జెక్టును అధ్యయనం చేసి, దానిలో పరీక్ష రాయాలి. స్కోరు చూసుకోవాలి. 75 శాతం స్కోరు వస్తే సరైన దిశలోనే వెళ్తున్నట్టు. కొద్దిరోజుల తర్వాత మరో పరీక్ష రాసి, స్కోరు ఎలా ఉందో పరిశీలించుకోవాలి. 75 శాతం మార్కులు నిలకడగా ఉంటే మరో సబ్జెక్టు అధ్యయనం ఆరంభించవచ్చు. ఇందాకటి మాదిరి మార్కుల స్వయం మూల్యాంకనం చేసుకోవాలి. అవసరమైనచోట తగిన మార్పులూ, మెరుగుదల చర్యలూ తీసుకుంటూ సన్నద్ధత సాగించాలి. ఇలా అన్ని సబ్జెక్టులూ పూర్తయ్యాక, అన్ని సబ్జెక్టులూ కలిసివుండే కాంప్రహెన్సివ్ పేపర్లు (గ్రాండ్ టెస్టులు) రాయాలి. వీటిలో నెగిటివ్ మార్కులు తీసేశాక కనీసం 65 శాతం మార్కులు రావాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. 65 శాతం తక్కువ కదా అనిపించవచ్చు కానీ నిలకడగా అన్ని మార్కులు సాధిస్తుంటే అభ్యర్థులు విజయపథంలోనే ముందుకు సాగుతున్నట్టు అర్థం. ఎందుకంటే... ప్రిలిమ్స్ కటాఫ్ మార్కుల సగటు దాదాపు 55 శాతమని గుర్తుంచుకోవాలి!

## ప్రశ్నల స్థాయి పెరుగుతోంది!

ప్రాథమిక పరీక్షలో అర్హత పరీక్షగా ఉన్న పేపర్-2ను తక్కువ అంచనా వేయకూడదు. దీనికెంతో ప్రాముఖ్యం ఉంది. ఇందులో కనీస మార్కులు 33%. అంటే, 200 మార్కులకుగానూ కనీసం 67 సాధించాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే అభ్యర్థి పేపర్-1ను దిద్దుతారు.

పేపర్-2లో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, రీజనింగ్ ఉంటాయి. గత కొద్ది సంవత్సరాల్లో ఈ పేపర్ కష్టతరంగా మారుతోంది. దీన్ని వడపోతగా ఉపయోగించాలని యూపీఎస్సీ భావించటమే దీనికి కారణం. ఆప్టిట్యూడ్‌లో ప్రశ్నల స్థాయి పెరుగుతూ వస్తోంది. ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ ప్రశ్నల సంఖ్యతో పాటు క్లిష్టత కూడా పెరుగుతోంది. ఒక కాంప్రహెన్షన్ పాసేజ్‌కి ఒక ప్రశ్న ఉంటుంది. దీంతో పేపర్ నిడివి బాగా ఎక్కువగా ఉంటోంది. పదో తరగతి తర్వాత ఆర్ట్స్‌లో చేరినవారు ఈ పేపర్‌పై అదనపు జాగ్రత్తలు తీసుకుని చదవాల్సివుంటుంది.

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**సెంట్రల్ వాటర్ కమిషన్**

పోస్టు: స్కిల్డ్ వర్క్ అసిస్టెంట్
ఖాళీలు: 57
అర్హత: పదోతరగతి/ ఐటీఐ.
ఎంపిక: అకడమిక్ మెరిట్, ఫిజికల్ టెస్ట్ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరితేది: 29.12.2017
వెబ్‌సైట్: http://www.cwc.gov.in/

**నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్**

పోస్టు: స్టెనోగ్రాఫర్, అసిస్టెంట్ తదితర పోస్టులు
ఖాళీలు: 25 అర్హత: నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ చివరి తేది: 31.01.2018 వెబ్‌సైట్: http://www.nclat.nic.in

**జీఆర్ఎస్ఈ, కోల్‌కతా**

పోస్టు: ట్రేడ్/ గ్రాడ్యుయేట్/ టెక్నీషియన్ అప్రెంటిస్
ఖాళీలు: 261 అర్హత: పదోతరగతి/ డిప్లొమా/ బీఈ/ బీటెక్.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ చివరి తేది: 27.12.2017
వెబ్‌సైట్: www.grse.nic.in

### ప్రవేశాలు

**నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్**

కోర్సు: గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ కోర్సు
సీట్ల సంఖ్య: 77 అర్హత: బీఈ దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరితేది: 19.01.2018 వెబ్‌సైట్: http://www.nptineyveli.in/

### ఫెలోషిప్స్

**ఉస్మానియా యూనివర్సిటీ**

పోస్టు: ప్రాజెక్ట్ ఫెలో ఖాళీలు: 01 అర్హత: ఎంఎస్సీ/ నెట్/ గేట్.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ చివరి తేది: 15.12.2017
వెబ్‌సైట్: http://www.osmania.ac.in//

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

పోస్టు: గెస్ట్ ఫ్యాకల్టీ
ఖాళీలు: 02
అర్హత: ఎంఏ తెలుగు/ నెట్/ స్లెట్.
దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా
ఇంటర్వ్యూ తేది: 03.01.2018
ఈమెయిల్: headtelugu@uohyd.ernet.in
వెబ్‌సైట్: www.uohyd.ac.in

**సీజీజీ, తెలంగాణ**

CENTRE FOR GOOD GOVERNANCE
Knowledge • Technology • People

పోస్టు: టెస్ట్ ఇంజినీర్
ఖాళీలు: 01
అర్హత: నిబంధనల ప్రకారం
ఇంటర్వ్యూ తేది: 16.12.2017
వెబ్‌సైట్: https://cgg.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.